# పెన్నూ—భంగులు

## వివేకభ్రష్ట సంపాతముల్

జీతం పుచ్చుకునే రోజు పంచప్రాణాలకీ ప్రాణం పోస్తుంది. కాని వచ్చే చిక్కేమిటంటే ఆ రోజు నెలకో మాటుగాని రాదు. అంచేత, ఆ ఫస్టు తారీఖుకోసం సంవత్సరానికి పన్నెండు తడవల చొప్పున, తడవకు ముప్ఫై, కొండొకచో ముప్పైఒకటిరోజుల చొప్పున పడిగాపులు కాయటం నేటి ఉద్యోగస్థుని విధ్యుక్తధర్మం. అది చేతనయినవాడే ఉద్యోగస్థుడు, లేక గుమాస్తా అనబడతాడు.

......జీతం డబ్బులు జేబులో వేసుకుని సైకిలెక్కి చల్లగాలిలో వస్తుంటే యేవేవో తీయని వూహలు హాయిని గొల్పేటానికి ప్రయత్నిస్తూ వుంటాయి..............................

నా తొంభై రూపాయల జీతాన్నీ నేను ప్రేమించేదాని కంటె యెక్కువగా ప్రేమిస్తుంది మా శ్రీమతి. ఆవిడ ఫస్టు తారీఖున ఆర్డరు వేసే వెచ్చాల లిస్టు సాధారణంగా అరతావు నిండుతుంది. అందులోనూ యిది శ్రావణ మాసమేమో—తావూ, తావున్నర కేమీ తక్కువ జెయ్యదు. పాపం, మానవు రాలు...ఇకపోతే, ఆ పైన సినిమాకు వెళ్ళేందుకు రూపాయి లేక పోతేమానె సిగరెట్లకి, బేడడబ్బులు కూడా దక్కవు— దేవుడితో చెప్పుకున్నానరే!!!

మురళీ కృష్ణవిలాస్ చూడగానే 'బ్రేకు' పడటం నాసైకిలు కలవాటు. అందులోనూ జీతాలిచ్చే రోజు మరీ విపరీతం!—ఒక ఫర్లాంగు దూరం వుండగానే 'ఆగి పోతాను' దిగమంటుంది. సమర్థుణ్ణి గనక ఆఫర్లాంగు దూరం యీడ్చు కొస్తూ వుంటాను, యెలాగో!

కమ్మని స్పెషల్ కాఫీ త్రాగి, ఒక గోల్డు ఫ్లేకు' పాకెట్టూ, అగ్గిపెట్టే, నాల్గు పక్కాపొడి పొట్లాలూ తీసుకున్నాను. సిగరెట్ అంటిస్తూంటే కన్పించిన దృశ్యం:— ప్రక్కనే వున్న ఫాన్సీ షాపులో పైన వ్రేలాడ దీసి వున్న జేబురుమాళ్లలో ఒకటి మటుకు చుక్కల్లో చంద్రుడి లాగ వెలిగి పోతోంది. ఏదో ఫారిన్ సిల్కులా వుంది.

'దాందుంప తెగిపోనూ, సిల్కు పాంట్లూ సిల్కు షర్టూ. తొడగక పోయినా కనీసం సిల్కు కర్చీఫ్ అయినా ఒకటి లేక పోతే యెందుకీ జన్మ?' అని పించింది.

వెళ్లి "ఖరీదెంత?" అని అడిగాను.

"ముప్పావలా!" అన్నాడు.

గుతుక్కు మంది గుండె! అయినా ఎదల బుద్ధి కాలేదు. "ఇప్పుడు కాక పోతే యింకోసారి మా ఆవిడ కొననిస్తుంది గనకనా! సరేలే, యేది శాశ్వతం?" అని కొనేశాను.

ఇంటి కొచ్చి వరండాలో సైకిల్ స్టాండు వేసి, యింట్లోకి ఒక్క దూకు దూకాను, శ్రీమతిని సర్ప్రైజు చేద్దామని.

"రాకండి!" అనే గదమాయింపు, గాజుల గల గల'

"చచ్చాం పో" అనిపించి, కుర్చీలో కూల పడ్డాను. ఇది ప్రథమ విఘ్నం.

"జీతాలిచ్చారా?" అని పిడుగులాగా వచ్చింది. చీరె సవరించుకుంటూ.

ఆవిడకి ముందు కావలసిందది! అచ్చుపొల్లు బోకుండా సంవత్సరానికి కనీసం' పన్నెండు సార్లంటుందా మాట!! ఇది మామూలే !!!

"ఇచ్చార్లే గాని, నీకో ఆశ్చర్యకరమైన వస్తువు చూపించనా?" అన్నాను.

"ఏమిటి అంత ఆశ్చర్యకరమైన వస్తువూ?" ఉన్నది సాగదీస్తూ.

"చెప్పుకో చూదాం!"

"తమరే సెలవీయండి!"

"అబ్బే నువ్వు చెప్ప గల్గితే యిచ్చేస్తా!"

"పోనీ దాచు కోండి!"

"దాచు కున్నా బయట పడేదేలే! అసలు నువ్వు ట్రై' చెయ్యి, చూద్దాం.........

'అబ్బ! ఆ చెప్పేదేదో చప్పున చెప్పండి. చంపక— అవతల టైమై పోతోంది—కమలమ్మ గారు వెళ్లి అప్పుడే అరగంటయింది— వాయనాలిచ్చేస్తున్నారో యేమో!" అంది గడగడా.

ఇక వాగించి లాభంలేదని తోచి, అసలు సంగతి బయట పెట్టేసి.

"ముప్పావలా! ఎలా వుందంటావ్??" అన్నాను.

"ఏడ్చినట్లే వుంది! ఇందుకా, యిందాకట్నుంచీ వాగించి చంపిందీ? ఇంకాయేం కోయింబత్తూరు చీరో తెచ్చారను కున్నా. అయ్యోహో అన్నారుష! ముప్పావలా బెట్టి ఒఖ్ఖ జేబురుమాలు తెచ్చారా? అందులోనూ శ్రావణ మంగళవారం పూటా—అందుకే లక్ష్మీ దేవి నిలవ కుండా పోతోంది మన దగ్గర..................."

వెంటనే కదీ దెబ్బలు తిన్నట్లయిందినాకు. ఏం మాట్లాడాలో తోచలేదు. నా మొహం చూచి, జాలిపడి, చిరునవ్వుతో "బొత్తిగా యింత అయోమయం మనుషులేమండీ?" అన్నది.

"ఏమనాలి?"

"పోనీ, యిలా తెండి దాస్తాను" అని అధికాస్తా లాక్కుని ఇంట్లోకి వెళ్లి దాచి వచ్చేసింది. వాకిట్లో ఆడుకుంటున్న మూడేళ్ల సుపుత్రుణ్ణి చంకనేసుకుని, సరేనే వెళ్లొస్తా, ఆ మిగిలిన జీతం డబ్బులైనా జాగ్రత్తగా దాయండి, మళ్లా ముప్పావలా బెట్టి ఏ అగ్గిపెట్టో, అరటిపండో తీసుకురాక—" అని వాకిటి గుమ్మందాకా వెళ్లి, అయ్యో, వాయనం శనగలెందులో పోయించుకురాను? అని స్వగతం అనుకుని వెనక్కి తిరిగొచ్చి "వీణ్ణోకమాట తీసుకోండి" అని వాణ్ణి నాకు తగిలించి లోపలికి వెళ్లింది.

నా చేతుల్లోకి వచ్చిందే తడవుగా వాడు సైరన్‌కూత మొదలెట్టాడు, వాణ్ణి ఓదార్చటం నావల్ల కాదని నాకే తెలుసు. అందుచేత ఆ ప్రయత్నమేమీ చెయ్యకుండా వాడి సంగీతం విని భరించడానికే నిశ్చయించుకున్నాను.

ఇక్కడ వీడి శృతి పెరుగుతున్నకొద్దీ లోపల మా శ్రీమతిగారి చేతుల్లో ట్రంకు పెట్టెలు కూడ తాళం వేస్తున్నాయి.

ఇంత బ్రహ్మాండమైన సంగీతం వినిపిస్తున్నా, లోపల్నుంచి మా ఆవిడగారి కంఠస్వరం కూడ నాకు వినిపించటం—నాఅదృష్టం.

"ఛీ ఛీ! సమయాని కొక్కటీ కన్పించదు!" అంటోంది.

మరి కాసేపటికి నా ముప్పావలా జేబురుమాలతో బయటికి వచ్చి, ఓరకంట చూస్తూ దగ్గరకొచ్చింది కుర్రాణ్ణి తీసుకోటానికి.

"పాపం! మళ్లీ ఇదే కావలసొచ్చింది గాబోలు దొరసాని గారికి" అన్నాను.

"ఆఁ, మరిలేకా!" అని సమాధానం.

"తకసేమరి— చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవ" అని— తప్పుతుందా?"

ఆహా, అప్పుడు—

"ఎలా తప్పుతుందే? దాన్ని ఎముక అడ్డమైన పాటుటూ అన్నపాపం ఇలా తిరాల్సిందే!"

"తీరితే తీరుతుందిగాని, నే వెళ్లొస్తా ఇక్కణ్ణ కొస్తూ జాగ్రత్తగా కనిపెట్టి పుచ్చుకుండి,అట్టాగే

పి. ఎస్. శాస్త్రి

పడి నిద్రపోక—'' అని పిల్లాణ్ణి చంకనేసుకుని బయల్దేరబోతుంటే.

''అవునుగాని, ఎందుకు నేనంటే అంత బెదురుపోతావ్?'' అన్నాను.

''ఆఁ, ఇది!— వదలండి— బబ్బ వదల కుంటే—అల్లరతాపు చేస్తూ మీరూను —'' అని తప్పించుకు పారిపోయింది.

''భార్యామణీ! భద్రం! అన్నాను, నాజేబురుమాలు పుద్దేశించి, కాంపౌండు గోడదగ్గర్నుంచి, ఒకసారి వెనక్కి తిరిగి చూసి, నవ్వి, వెళ్లిపోయింది.

''భేష్! పైకి కొద్దిగా కోప్పడ్డా, లోలోపల యెంతగానో సంతోషించివుంటుంది.... అసలు విశేషమంతా ఆ జేబురుమాలలోనే వుందిలే! మా ఆవిడేమిటి? మహా మహా మా అత్తయినా ఆశ్చర్యపడి, అదిరిపోవాల్సిందే! అంత చక్కని క్లాత్! అంత చక్కని డిజైను! అది కొన్నందుకు అసలు ముందు నన్ను నేనభినందించుకోవాలి— వెధవ ముప్పావలా పోతేపోయిందిగాని.... సిగ్గరెట్ అంటించి పక్కపాడి వేసుకున్నాను.

అసలు రేపిది చూసి ఆఫీసులో ఒక్కొక్కడూ ఐస్ అయిపోడూ? వాళ్లలో ఎవరికైనా ఒక్కడికుందీ? అలాటి కర్చీఫూ? మహా ఎహా మా ఆఫీసరుకే లేదు—హె!—''

—అరెరె—అవునుగానీ, అంత చక్కని దాన్ని పేరంటానికి తీసుకువెళ్లింది, దాంటో యే చిమ్మిరి వుండలో మూటకట్టుకురాదు గదా! వెధవది, మరకలవుతుందో యేమో !— అయినా యిది చిమ్మిరి పేరంటం కాదుగా— ఫర్వాలేదులే.

ఆవిడగారు వచ్చేసరికి రాత్రి ఎనిమిదన్నరో పావుతక్కువ తొమ్మిదో అయింది. ఒకసారి లోపలికి వెళ్లివచ్చి.

''అబ్బబ్బ! మీ జేబురుమాలు చూసి వాళ్లందరూ యేం మెచ్చుకోటం, యేం మెచ్చుకోవటం? ప్రాణాలు తీసాదిలిపెట్టారనుకోండి ఒకళ్ల తర్వాత ఒకళ్లు చేతబుచ్చుకు చూస్తేగా వాళ్ల తృప్తి తీరలేదండీ!''

''ఆఁ! మరేమిటనుకున్నావ్? మన మేంజేస్తే అదే ఘన కార్యం. ఏదిలా యివ్వు, మరొక్కమాటు చూసుకుంటాను, నా ముద్దుల జేబురుమాల్ని.

''ఇంట్లో దణ్ణంమీద వేశాన్లెండి !—అది సరే, తెలుగు మేష్టరుగారి భార్య శాంతమ్మగారేమందో తెలుసా?— మీవారే నయమమ్మా ! చక్కగా ఇలాంటివన్నీ తెస్తారు. మావారున్నారంటే ఇవ్వేమీ తెలియవుగదా— వేళకు తిండీ నిద్రా వుంటే ఇంకేమీ అక్కర్లేదాయనకు—'' అన్నది.

''మరి నువ్వే మన్నావ్?''

''ఏమన్నానా—'' ఆఁ అదే శుభ్రం లెండి కుదుపుగా వుండాలిగాని ముప్పావలా ముప్పావలా పెట్టి ఒక్క జేబురుమాలు తెచ్చి సంసారం చెయ్యాలనేనా? అసలు మావారికి ఒళ్లు తెలీదు చేసిన పాపం చెబితే పోతుంది''

''అన్నావ్?''

''అలా అన్నానో లేదో చాల్లే వూరుకోండి!'' అంటూ రుయ్యిన లేచిందండీ ఆవిడా!''

''అదీ! వూళ్లో వాళ్లంతా లేదని యేడుస్తుంటే వున్నదని అఘోరిస్తావ్! నీఖర్మ నేనేం జెయ్యన్లే!''

''సరే భోంచేద్దురుగాని లెండి, పొద్దుపోతోంది.''

''భోజనం సరేలే, అదొకసారిలా యివ్వమంటుంటే.

''ఇస్తాన్లెండి, ఇప్పుడేం తొందర? రేపు మీరు ఆఫీసుకు వెళ్లే వేళకిగా — ముందు భోజనానికి రండి!''

''ఏం ఇప్పుడివ్వగూడదా? కొంపేం మునిగిపోతుందా?''

''ఉతకాలండీ'' అన్నది పక్క చూపులు చూస్తూ.

''ఉతకాలా? ఇంతకు ముందు తెచ్చిన కొత్త, సిల్కు, రుమాల— ఉతకాలా? ఏం, చిమ్మిరుండలు మూటగట్టుకొచ్చావా? నూనె మరకలయ్యాయా ?

''చాల్లే వూరుకోండి! శ్రావణ మంగళవారం పేరంటానికి చిమ్మిరుండలు పెడతారా? చిమ్మిరుండలెందుకు పెడతారోకూడా తెలీదన్న మాట ! '

''ఏమో, నువ్వెప్పుడైనా చెబితేగా—ఇంతకీ అసలు సంగతేమిటంటావ్ !''

' అదిగాదండీ— చెప్పమంటారా? ఎందుకు లెద్దురూ—!''

''శ్రీరామచంద్ర!''

''అదికాదండీ, ఏమయిందంటే, మన కలెక్టరు గారి అసిస్టెంటో ఆయన నెవరో లేడూ ఆయన పెళ్లాం కూడ వచ్చిందండీ పేరంటానికి వాళ్లబ్బాయికి తొమ్మిదో నెలట— బొద్దుగా ముద్దొస్తూ వుంటాడులెండి, మన వెధవల్లే గాకుండా— అయితేనేమో, మరీ, యెత్తుకోమనిచ్చింది. తీరా యెత్తుకున్నాక వున్నవాడుండక అది కాస్తా యెప్పుడో తడిపేశాడు.....''

''హరి భగవాన్! పురిట్లోనే సంధిగొట్టినట్లు ఆదిలోనే అంత గతి పట్టించావా ? ముచ్చట పడి నేను తెచ్చుకోటమేమిటి, దాని ఖర్మ అలా కాలిపోవటమేమిటే? అసలు నేననుకుంటూనే వున్నా. దాన్నేదో చేసుకొస్తావని....'

''ఇప్పుడేమయిందనీ, అంత ఇదయిపోతారు? తెల్లవారేసరికి సబ్బెట్టి ఉతికి మీది మీకిస్తాను సరేనా ?''

''నా బొంద, ఉతికిస్తుందట, ఉతికి. అసలు నాకు బుద్ధివుండొద్దూ? పేరంటానికి వెళ్లే దాని కియ్యటమేమిటి, దాన్ని?''

, మరేం ఫర్వాలేదుతెద్దురూ— మనపిల్లాడు చేస్తే యేం చేస్తాం గనక?— సరే భోంచేద్దురుగాని లెండి.''

''వాదించి లాభం లేదు.'' వూరుకున్నాను.

* * *

ఉదయం కాఫీ తీసుకుంటూ అడిగాను,

''ఉతికావా?''

''ఇదిగో, కుంపట్లో బొగ్గులు చల్లార్చి, తడిపెడతాను.''

''ఏమిటి? బొగ్గులా?''

''కాదులెండి, మరీనూ! జేబురుమాల.''

''రక్షించావ్, త్వరగా కానీ'' అన్నాను.

పదిగంటలకు భోజనం చేసి బట్టలు వేసుకుంటూ ఒక కేక వేశాను, ఆరిందో లేదోనని.

''ఏమిటో వస్తున్నా'' అంది వంటింట్లోనుంచి.

ఇదొక సస్పెన్సూ! సరే నేనె వెళ్లా వంటింట్లోకి.

''ఆరిందా? అసలు ఉతికావా?'' అన్నాను.

''ఏమిటీ? జేబురుమాలా?—ఆ, ఆరేశాను దొడ్లో, జామిచెట్టుమీద వున్నది, తీసుకోండి'' అన్నది కంచం యెత్తుతూ.

కాస్త మనస్సు తేలికపడింది. సరాసరి జామిచెట్టు దగ్గరకి నడిచాను—కాని, కళ్లుమూసుకోవాలిసొచ్చింది— నా జేబురుమాలు చూడలేక కాకులు కూడ కళ్లల్లో నిప్పులుపోసుకున్నాయి ఛీ ఛీ !

, 'అయ్యో! తొందరగా ఆరుతుందని ఇక్కడ ఆరవేశానండీ! పాడు కాకులు! పోన్లెండి మళ్లా పుతుకుతాను, సాయంత్రానికి కారుతుంది. ''

''నా బొంద!''

* * *

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చాక,

, 'ఇంతసేపటిదాకా యేంచేస్తున్నారండీ ? మీకోసం కూచుని కూచుని ఇప్పుడే వెళ్లాడు'' అన్నది, యెవరో, చెప్పకుండా. ('సస్పెన్సు'అనే దాని మా శ్రీమతి సొంత సొమ్ములాగా చూసుకుంటుంది. అసలు 'సస్పెన్సు' ముందు పుట్టి తర్వాత మా ఆవిడ పుట్టివుంటుంది.)

నాకు తప్పదుగా మరీ, అందుచేత,

''ఎవరూ?'' అని అడిగాను.

''చాకలాడు — మీరు తొడుక్కున్న బట్టలు వెయ్యక్కర్లేదా?'' అంది.

, 'సరే! ఇంకేమిటో అనుకున్నాను — సరే గాని నా జేబురుమాలు క్షేమమేనా?''

''ఆహాఁ!''

''ఏ పరిస్థితిలో వుంది?''

''చాకలాడికి వేశాను.'' ఎల్లుండిపొటికి విక్టోరియా పంగా తోమి పట్టుకొచ్చేస్తాడు. మీ జేబురుమాలు కొచ్చిన భయమేం లేదు '' అన్నది.

చెయ్యగల్గిందేముందీ ?

* * *

''చాకలి బట్టలు తెచ్చాడా?'' అన్నాను ఆఫీసునుండి వస్తూనే.

''ఆ తెచ్చాల్లెండి!''

"మరి బయల్దేరలేదేం? ఎవరూ పిలవలేదా, శ్రావణ శుక్రవారం పేరంటానికి ?"

"పిలిచిందిలెండి ఉదయలక్ష్మమ్మగారు."

"మరింకేం, బయల్దేరు, ఆ ముష్పావులా జేబురుమాలు పుచ్చుకుని మళ్లా యే తాసీల్దారు గారి పుత్రుణ్ణో యెత్తుకుందువుగాని " అన్నాను.

"వాళ్లింటికి వెళ్లబుద్ధికాదండీ నాకు, ఆవిడ అసలే మొటమొటలాడుతూ వుంటుంది."

"అయినాసరే నిన్నుచూసి జంకాల్సిందేనే!"

"ఏం నేనేం రాక్షసినా?"

"అబ్బో శృతిమించేటట్టుందే!" అనుకుని.

"సరేగాని జేబురుమాలు తెచ్చాడా చాకలి ?" అన్నాను.

"ఆ" అంది.

"ఆఁ? ఏది, ఇలాతే, అన్నాను ఆత్రంగా

"మర్చిపోయా! ఇందాకేమయిందో చూశారా? మీరొచ్చే ముందే చాకలి బట్టలా కుర్చీమీద పెట్టివెళ్లాడు. నేనింకా పద్దు పుస్తకం పుచ్చుకుని చూస్తుంటే మన పక్కింటి కమలమ్మగారు వచ్చి "ఏమండీ, పేరంటానికి రారా ?" అనడిగింది. నాకు వెళ్లటానికిష్టంలేక" రానండీ, ఒంట్లో బాగాలే"దని చెప్పేశాను. అక్కడి నుంచీ తనదార్న తాను వెళ్లాక, "ఆ వున్న ఒక్క రుమాల పిల్లలెక్కడ పారేశారో యేమో, ఇవాల్టికి కాస్త మాదిస్తారా?, మళ్లా రాగానే ఇచ్చేస్తాను"అన్నది ఇస్త్రీ మడతల వంకచు చూస్తూ."

"ఇచ్చేశావా?"

"ఏం చెయ్యను మరి? కళ్ల కెదురుగా కనిపిస్తుంటే! 'సరే పట్టికెళ్లండి, దానికేంభాగ్యమా, బంగారమా?' అన్నాను. అంతకంటే ఏమనను? పేరంటానికి రానని ముందే చెప్పానయ్యె. నాకవసరంలేదని తెలుస్తూనే వుండె! పోనీ, మీరు తీసుకువెళ్లారని చెబుదామా అంటె యెదురుగా అరచేతి మందాన వున్న మడతలకంటే పైనే కనిపిస్తూ వుండె — ఎలా కాదనను?" అంది.

'హు! తెచ్చి నాలుగురోజులైనా కాలేదు. కొన్న కాసేపూ దాని మొహం యేం చూశానో, అంతే! ఆ తర్వాత అదెలా వుంటుందో నాకు తెలీదు. ఇంటికి తెచ్చీ తేగానే నాల్గు చీవాట్లెట్టి యెగరేసుకుపోయిందావిడ. ఇంటికొచ్చి,చేసిన ఘన కార్యం' మెల్లి మెల్లిగా బయట పెట్టింది. పోనీ ఉతికిందిగదా అనుకుంటే ఆ దరిద్రపు కాకులు ఓర్వలేకపోయె. పోనీ ఇప్పుడు చాకలి తెచ్చాడుగదా అనుకుంటే, పక్కింటి కమలమ్మ గారు పట్టుకెళ్లారట. కమలమ్మ గారు ఛ ఛ నాన్సెన్స్ !

కానీ యేం జేస్తాంలే !

* * *

"ఏమండోయ్! ఇది విన్నారా?"

"ఏమిటది?"

"ఇప్పుడే ఆవిడ గోడదగ్గరకి పిలిచి చెప్పింది, మళ్లా యెవరితోనో అనబోకండి. పాప మావిడ యేమనుకుంటుందో యేమో !

"అబ్బ! ఆ చెప్పేదేదో త్వరగా చెప్ప గూడదూ, వూరికే 'నస' !"

"చెబుతున్నా వినండి మళ్లీ యెక్కడా అనబోకండి — నిన్న సాయంత్రం, ఆవిడ కమలమ్మగారు మన జేబురుమాలు తీసుకుని పేరంటానికివెళ్లిందా వెళ్లి యింటికివచ్చాకేమైనా వాళ్లాయన ఫోంచేసి రెండో ఆట సినిమాకు వెళ్దామన్నాడట. సరేనని ఇద్దరూ బయల్దేరారట. ఆయనేమో మనీపర్సులో డబ్బు పెట్టుకుని యెక్కాడట.... జేబుదొంగలకి అది మనీ పర్సు అనితెలియకుండా వుండటానికి ఆయనేమో సాధారణంగా మనీపర్సు జేబురుమాలుతో చుట్టి పట్టికెళడం అలవాటుట. రాత్రికూడ సమయానికి మరోటి కన్పించకపోవటం చేత కమలమ్మగారు మన జేబురుమాలులో పర్సు చుట్టి ఇచ్చిందట. ఆ పర్సు అలాగే ఆయన పాంటు జేబులో వేసుకున్నాడట. సరే, ఇద్దరూ సినిమాహాలు ముందు దిగేసరికి మొదటి ఆట విడిచిపెట్టారట....."

"ఏమిటీ గొడవ!" అనుకున్నా.

"....మొదటి ఆట జనమంతా గుంపులు గుంపులుగా వస్తుంటేనూ, ఆవిణ్ణి ఒకచోట నుంచోబెట్టి ఆయన టిక్కట్టు తేవటానికి ఆ జనమందర్నీ తోసుకుంటూ యెలాగో సందు చేసుకుని పావం, బుకింగుఆఫీసు దగ్గరకు చేరుకున్నాడట. సరే టికెట్టు కొందామని పర్సు కోసం జేబులో చెయ్యిపెట్టాడట! పెడితే యేముంది ?

"ఏముందీ?" అన్నాను ఆత్రంగా.

"జేబు ఖాళీ....."

"ఆఁ?"

" ఆ పర్సు కాస్తా యెవడో గొట్టేశాట్ట!

"మరి మన జేబురుమాల ?"

"దాంతోనే వెళ్లింది !"

"ఆఁ?" అంటూ కుప్పకూలిపోయాను.



'సీ అంతపన్లో నేను' ఫొటో: కె. ఆర్. టి. కె. రావు, మద్రాసు.